క్లుప్తంగా

రంజాన్ శుభాకాంక్షలు



మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): రంజాన్ పర్వదినం సందర్భంగా నియోజకవర్గంలోని ముస్లిం సోదర సోదరీమణులకు వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు శుభాకాంక్షలు తెలిపారు. సర్వమత సమ్మేళనానికి ప్రతీకగా జరుపుకొనే రంజాన్ పండుగ అందరి జీవితాల్లో సంతోషం నింపాలని.. అల్లాహ్ దీవెనలతో నియోజకవర్గ ప్రజలకు సకల శుభాలు కలగాలని ఆకాంక్షించారు.

నేడు వీఎంసీలో ప్రజా ఫిర్యాదులు-పరిష్కార కార్యక్రమం రద్దు

పటమట(విజయవాడతూర్పు): రంజాన్ పండుగ సందర్భంగా సెలవు దినం కావడంతో విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదులు - పరిష్కార కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ డీ చంద్రశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాన కార్యాలయంతో పాటు నగరంలోని మూడు ప్రాంతాల్లో ఉన్న సర్కిల్ కార్యాలయాల్లోనూ రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

శేషకుమార్‌కు ఉగాది పురస్కారం



మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు, ప్రముఖ సామాజిక సేవకుడు, రచయిత డాక్టర్ కమ్ముల రవిగంగాధర శేషకుమార్ ఉగాది పురస్కారాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఆదివారం అందుకున్నారు. ఏపీ ప్రభుత్వం రాష్ట్ర సృజనాత్మక, సంస్కృతి, భాషా సంస్కృతిక శాఖ వారి ఆధ్వర్యంలో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన విశ్వావసు ఉగాది పురస్కారాల ప్రదాన కార్యక్రమంలో 'సామాజిక సేవ' విభాగంలో ఆయనకు జ్ఞాపికతో పాటు, రూ. 10 వేలు నగదు పారితోషకం అందజేసి సత్కరించారు.

నేడు వడ్డీపై రాయితీకి చివరి అవకాశం

పటమట(విజయవాడ తూర్పు): విజయవాడ నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన ఇంటి పన్ను, ఖాళీ స్థలాల పన్ను బకాయిల వడ్డీపై 50 శాతం రాయితీ పొందేందుకు సోమవారమే చివరి అవకాశమని వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ డీ చంద్రశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రంజాన్ సెలవు అయినా కూడా వీఎంసీ పరిధిలోని 13 క్యాష్ కౌంటర్లు ఉదయం ఆరు నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు పనిచేస్తాయని తెలిపారు. వీటితోపాటు నగర పరిధిలోని అన్ని సచివాలయాల్లోనూ పన్నులు చెల్లించవచ్చని అన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పన్ను బకాయలు చెల్లించి వడ్డీపై 50 శాతం రాయితీని పొందాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): గుర్తు తెలియని వాహనం ఢీ కొని యువకుడు గాయపడిన ఘటనపై అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదు అయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అజిత్‌సింగ్ నగర్‌కు చెందిన విత్తనాల చంద్రశేఖర్ (21) సోలార్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. ఆయన 29వ తేదీ రాత్రి జిమ్ నుంచి ఇంటికి వెళుతుండగా గుర్తు తెలియని ద్విచక్రవాహనం ఢీ కొట్టింది. ఈ ఘటనలో గాయపడిన చంద్రశేఖర్‌ను ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పాస్టర్ ప్రవీణ్‌కుమార్‌కు నివాళి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): యునైటెడ్ క్రిస్టియన్ యూత్ ఆధ్వర్యాన ఆదివారం 42వ డివిజన్‌లో 10 చర్చిలకు చెందిన విశ్వాసులు పాస్టర్ పగడాల ప్రవీణ్‌కుమార్‌కు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. పెద్ద సంఖ్యలో విశ్వాసకులు కొవ్వొత్తులు చేతబూని ప్రదర్శనగా పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు.

భక్తిశ్రద్ధలతో ఉగాది వేడుకలు



మధురానగర్ శ్రీఅంకమ్మతల్లి శక్తిపీఠంలో అమ్మవారు



జ్యోతిష్య పండితుడు సుబ్బరామ సోమయాజిని సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు



శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో పూజలు



లబ్బీపేట శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో వేద పఠనం చేస్తున్న అర్చకులు

కిటకిటలాడిన దేవాలయాలు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఉగాది మహోత్సవ వేడుకలు ఆదివారం సత్యనారాయణపురంలోని గాయత్రి కన్వెన్షన్ సెంటర్‌లో కనులపండువగా జరిగాయి. ముందుగా సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం, హనుమాన్ చాలీసా పారాయణం, వేద పండితులచే వేద స్వస్తి నిర్వహించారు. అనంతరం ప్రముఖ జ్యోతిష్య పండితులు కప్పగంతు సుబ్బరామ సోమయాజి పంచాంగ పఠనం చేశారు. శ్రీ విశ్వావసు నామ సంవత్సరంలో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆరోగ్యవంతులుగా ఉంటారని తెలిపారు. పంటలు బాగా పండి రైతు ఆనందంగా ఉంటాడని, ప్రజలకి జీవనోపాధి అవకాశాలు మెరుగు పడతాయని పేర్కొన్నారు. అనంతరం ఆయా రాశుల వారికి ఈ సంవత్సరంలో కలిగే ఫలాలను తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విశ్వావసు నామ సంవత్సరంలో ప్రజలందరికీ అమ్మవారి ఆశీస్సులు మెండుగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం మల్లాది విష్ణు చేతులమీదుగా పంచాంగకర్తను దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు.

పురస్కారాల ప్రదానం

ఉగాది వేడుకలను పురస్కరించుకొని వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన పలువురిని ఘనంగా సన్మానించారు. వీరిలో పాలపర్తి శ్యామలానంద ప్రసాద్, డాక్టర్ క్రోవి పార్థ సారథి, డాక్టర్ జీవీ పూర్ణ చందు, డాక్టర్ ఉపద్రష్ట రమణ మూర్తి, మోదుమూడి సుధాకర్ , పీవీఎస్ కృష్ణ, డాక్టర్ ధూళిపాళ రామక్రిష్ణ, భాగవతుల శ్రీనివాస్ , బుర్రా పద్మనాభ శర్మ, పప్పు సదాశివ శాస్త్రి, గండూరి శ్రీనివాస మూర్తి, తుర్లపాటి బైర్రాజు, సీతేపల్లి రవికుమార్, కొండిపర్తి రామక్రిష్ణ శర్మ, డాక్టర్ డీ వెంకటేశ్వరరావు తదితరులకు ఉన్నారు. కార్యక్రమంలో స్థానిక 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణి మూర్తి, గాయత్రీ సొసైటీ జనరల్ సెక్రటరి చల్లా హరికుమార్, సెక్రటరి దూబగుంట శ్రీనివాస్, కోశాధికారి జీకే సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): విశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదిన వేడుకలను ఆదివారం నగరవాసులు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ముత్యాలంపాడులోని శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయంలో వసంత నవరాత్రులు ప్రారంభమయ్యాయి. భక్తులు తెల్లవారుజాము నుంచే పెద్దసంఖ్యలో ఆలయానికి చేరుకుని పూజలు చేశారు. భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. అలాగే ముత్యాలంపాడు గ్రామదేవత శ్రీఈశ్వరమ్మ అమ్మవారి ఉగాది సంబరాలు ప్రారంభమయ్యాయి. భక్తులు అమ్మవారికి సారె సమర్పించారు. సాయంత్రం అమ్మవారి ఊరేగింపు జరిగింది. శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ మండలి కన్వీనర్ మందలపర్తి సత్యశ్రీహరి దంపతులచే పసుపుకొమ్ములు, గాజులతో పూజలు జరిగాయి. మధురానగర్ నేతాజీ కాలనీ శ్రీఅంకమ్మతల్లి శక్తిపీఠంలో ఉగాది వేడుకలు జరిగాయి. పీఠం వ్యవస్థాపకుడు అన్నాబత్తుల శరాబందీరావు అమ్మవారికి విశేషంగా పూజలు చేసి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

అంతా శుభమే జరగాలి

శ్రీ విశ్వావసు నామ సంవత్సరంలో అందరికీ శుభమే జరగాలని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆకాక్షించారు. సీతారాంపురం శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఉగాది వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. తొలుత శివ లింగానికి అభిషేకం చేశారు. బంకా బాబీ, కోలంటి రవి, చిన బాబు, విజయలక్ష్మి, మానం గంగాధర్ పాల్గొన్నారు.

శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో ..

శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో శ్రీధర్మపరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యాన వసంత నవరాత్రులు ప్రారంభమయ్యాయి. అమ్మవారికి హరిద్రాచూర్ణంతో అర్చనలు, సామూహిక కుంకుమార్చనలు చేశారు. శ్రీషిర్డీసాయిబాబా మందిరంలో బాబావారికి, శ్రీమరకత పోలిక శ్రీభవానీ శంకరస్వామి, వినాయకస్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం జరిగింది.

కంచికామకోటిపీఠం ఆధ్వర్యంలో ఉగాది

విజయవాడ కల్చరల్: కంచికామకోటిపీఠం ఆధ్వర్యాన లబ్బీపేట శారదా చంద్రమౌళీశ్వర, శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో విశ్వావసు నూతన సంవత్సరం సందర్భంగా ఆదివారం దేవాలయ నిర్వాహకులు డాక్టర్ సీ రామ్మోనరావు పర్యవేక్షణలో ఉగాది వేడుకలు జరిగాయి. అర్చకులు వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితులు నవగ్రహ హోమం, చతుర్వేద పారాయణం నిర్వహించారు. తంగిరాల వెంకట పూర్ణసిద్ధాంతి పంచాంగ శ్రవణం చేశారు.

టీటీడీ ఆధ్వర్యంలో..

తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో పున్నమ్మతోటలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం ఆగమోత్తంగా స్వామివారికి పూజలు నిర్వహించారు. సుప్రభాతసేవతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ లలితా రమాదేవి ఏర్పాట్లు పర్యవేక్షించారు. డాక్టర్ క్రోవి పార్థసారధి పంచాంగ శ్రవణం చేశారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఉగాది పర్వదినం పురస్కరించుకొని అల్లూరి సీతారామరాజు వంతెన సమీపంలోని శ్రీ మణికంఠ కార్యసిద్ధి వినాయకుని మందిరంలో జరిగిన దీపాలంకరణ సేవలో మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ ముఖ్య అతిథులుగా పాల్గొని పూజలు చేశారు. వైఎస్సార్ సీపీ అంగన్‌వాడీ విభాగం సెంట్రల్ నియోజకవర్గ అధ్యక్షురాలు శీలం భవానీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): స్థానిక సత్యనారాయణపురం, శివాజీకేఫ్ సెంటర్‌లో పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు సీహెచ్ బాబురావు పాల్గొని ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ బీ రమణరావు, పౌర సంక్షేమ సంఘం డివిజన్ నాయకులు ఎం మురళీకృష్ణ, ఆటో యూనియన్ నాయకులు హనుమంతరావు, భద్రం , సైదులు, రాజా పాల్గొన్నారు.

బాబా మందిరంలో వేడుకలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): లెనిన్ సెంటర్‌లోని ఓం శ్రీషిర్డి నాగసాయిబాబా, నాగమానసాదేవి మందిరంలో శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉగాదిని ఘనంగా నిర్వహించారు. వేదపండితులు పంచాంగ శ్రవణం చేశారు. షిర్డీ సాయినాథునికి పూలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు పంచాంగాలు పంపిణీ చేశారు. అన్న ప్రసాద వితరణ జరిగింది.



ఈశ్వరమ్మ అమ్మవారికి సారె తీసుకువెళుతున్న భక్తులు



లెనిన్ సెంటర్‌లో సాయిబాబాకి పూలతో అభిషేకం చేస్తున్న భక్తులు

దేవికారాణి వడయార్‌కు సత్కారం



మధురానగర్(విజయవాడసెంట్రల్): పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంకు చెందిన అంతర్జాతీయ తొలి మహిళా శిల్పి దేవికారాణి వడయార్‌ను ఆదివారం ఉగాది పర్వదినం పురస్కరించుకుని డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యాన ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె సేవలను సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ బీ వసంతకుమార్, కోశాధికారి గుర్రం ఏడుకొండలు, ఆంజనేయరాజు కొనియాడారు. కార్యక్రమంలో ఎస్‌కే షఫీ, కోరంగి నాగమల్లిక తదితరులు పాల్గొన్నారు.

2న సంప్రదాయ వస్త్రధారణ పోటీలు

విజయవాడ కల్చరల్: శ్రీదేవీ సాంస్కృతిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వచ్చే నెల 2వ తేదీన సాయంత్రం మూడు గంటలకు బందరురోడ్డులోని మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో సంప్రదాయ వస్త్రధారణ పోటీలను నిర్వహించనున్నట్లు సంస్థ వ్యవస్థాపకురాలు దూపాటి శ్రీదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వయస్సు నిమిత్తం లేకుండా ఎవరైనా పోటీల్లో పాల్గొనవచ్చునని చెప్పారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, సూపర్ సీనియర్ విభాగాల్లో పోటీలు ఉంటాయని తెలిపారు. మరిన్ని వివరాలకు 94402 63055 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

కోడి పందేలపై దాడి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): టేకు తోటల్లో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న కోడి పందేలపై కొత్తపేట పోలీసులు ఆదివారం దాడి చేశారు. పోలీసుల కథనం మేరకు..కొత్తూరు తాడేపల్లిలోని టేకు తోటల్లో కొంతమంది గుట్టుచప్పుడు కాకుండా కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఆయా పరిసరాలపై పోలీసులు నిఘా పెట్టారు. ఆదివారం సాయంత్రం కొంత మంది కోడి పందేలు వేస్తున్నారని సమాచారం అందుకున్న పోలీసులు తోటల్లో దాడులు చేశారు. కోడి పందేలు వేస్తున్న ఆరుగురిని అదుపులోకి తీసుకోవడంతో పాటు వారి వద్ద నుంచి రూ.5640 స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన ఎంఎస్ మూర్తి శతజయంతి ఉత్సవాలు



సన్మాన గ్రహీతలతో నిర్వాహకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక ముత్యాలంపాడు ఎంఎస్‌మూర్తి ఆర్ట్ గ్యాలరీలో ఆదివారం ఎంఎస్ మూర్తి శతజయంతి ఉత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా ఆంధ్ర అకాడమీ ఆఫ్ ఆర్ట్స్, ఫోరం ఫర్ ఆర్టిస్ట్, జాషువా సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో చిత్రకళా ప్రదర్శన కళాకారుల సత్కారం కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో సిద్దార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్, డీమ్డ్ యూనివర్సిటీ ప్రో వైస్‌ఛాన్సలర్, ప్రొఫెసర్ అట్లూరి వెంకట రత్నప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని చిత్రకళా ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళలు సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయని కళలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. అకాడమీ కార్యదర్శి ఎంవీ సాయిబాబు మాట్లాడుతూ చిత్రకళ అభివృద్ధికి ఎంఎస్ మూర్తి అందించిన సేవలను పురస్కరించుకుని ఆయన శతజయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం సిద్ధార్థ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఎం రవిచంద్ అకాడమీ కార్యదర్శి ఎంవీ సాయిబాబు చిత్రకారుల చేతులమీదుగా చిత్రకారుడు ఎస్ నాగేశ్వరరావు, కళా సేవకులు అయోధ్య నాగేశ్వరరావు, బీ నగేష్‌కుమార్, ఉగాది సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి కళారత్న పురస్కార గ్రహీత ఏ గిరిధర్‌లను సత్కరించినారు. కార్యక్రమంలో చిత్రకారులు ఏ సునీల్‌కుమార్, పరుచూరి అజయ్, మల్లిక్, సృజన్, డీ దుర్గాప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

మత్తుపదార్థాలకు యువత దూరంగా ఉండాలి

ఎంసీపీఐ రాష్ట్ర కార్యదర్శి వెంకటరెడ్డి



మాట్లాడుతున్న వెంకటరెడ్డి

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): మతోన్మాదానికి, మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని ఎంసీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎం.వెంకటరెడ్డి పేర్కొన్నారు. స్థానిక మాచవరం కళాశాల దగ్గర ఉన్న ఎంసీపీఐ రాష్ట్ర కార్యాలయంలో భారత ఐక్య యువజన సమాఖ్య (యూవైఎఫ్ఐ) నగర కమిటీ ఆధ్వర్యంలో వైజ్ఞానిక తరగతులు ఆదివారం జరిగాయి. ఈ కార్యక్రమానికి వెంకటరెడ్డి హాజరై మతోన్మాదం, మత్తుపదార్థాల వినియోగం–సమాజంపై వాటి దుష్ప్రభావాలు అనే అంశంపై మాట్లాడారు. ప్రస్తుతం దేశంలో ప్రమాదకరస్థాయిలో మతోన్మాదంతో పాటుగా మత్తుపదార్థాల వినియోగం ఉన్నాయని చెప్పారు. యువత వీటికి వ్యతిరేకంగా పోరాడాలన్నారు. యువైఎఫ్ఐ రాష్ట్ర కన్వీనర్ కాసాని గణేష్ బాబు మాట్లాడుతూ ఇటీవల కాలంలో రాష్ట్రంలో మత్తు పదార్థాల వినియోగం ఎక్కువగా ఉందన్నారు. వీటి జోలికి వెళ్లి యువత తమ ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని కోరారు. సమాఖ్య ఉమ్మడి కృష్ణాజిల్లా కార్యదర్శి గొల్లపూడి ప్రసాద్, గుంటూరు జిల్లా కార్యదర్శి బండారు శ్రీనివాసరావు, ఏఐసీటీయూ రాష్ట్ర కన్వీనర్ వల్లెపు లక్ష్మీనారాయణ, యువైఎఫ్ఐ నగర నాయకులు అనకాపల్లి కనకరాజు, హరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్

మధురానగర్(విజయవాడసెంట్రల్): మత సామరస్యాన్ని పెంపొందించి ఐక్యతను చాటే పర్వదినం పవిత్ర రంజాన్ అని ఎమ్మెల్సీ రుహుల్లా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిం సోదరులందరు సుఖసంతోషాలతో జీవించేలా అల్లా అనుగ్రహించాలని ఆకాంక్షించారు.

రంజాన్‌కు మసీదులు ముస్తాబు



మధురానగర్(విజయవాడసెంట్రల్): రంజాన్ వేడుకలకు మసీదులు ముస్తాబయ్యాయి. గత నెల రోజులుగా కఠిన ఉపవాసం పాటిస్తున్న ముస్లిం సోదరులు రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించుకోవడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. మారుతీ నగర్, మధురానగర్, భానూనగర్, రోశిళ్ల పాలెం తదితర ప్రాంతాల్లోని మసీదులను విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. రంజాన్ పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

బహుముఖ ప్రతిభాశాలి భాగవతుల



వెంకట్రామ శర్మను సత్కరిస్తున్న వెంకటసుబ్బారావు

విజయవాడ కల్చరల్: బహుముఖ ప్రతిభాశాలి భాగవతుల వెంకట్రామ శర్మ అని కౌతా పూర్ణానందం విలాస్ ధర్మసత్రం నిర్వాహకుడు కౌతా వెంకటసుబ్బారావు అన్నారు. నూతన సంవత్సం ఉగాది వేడుకల సందర్భంగా 2025 సంవత్సరానికిగానూ కౌతా పూర్ణానందం వేదికపై 'కౌతా పూర్ణానందం స్మారక పురస్కారాల' కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. సుబ్బారావు మాట్లాడుతూ సంప్రదాయ నృత్య కుటుంబానికి చెందిన వెంకట్రామ శర్మ తన జీవితాన్ని నాట్యానికి అంకితం చేసినట్లు తెలిపారు. పురస్కార గ్రహీత వెంకట్రామ శర్మ మాట్లాడుతూ కౌతా పూర్ణానందం ధార్మిక సేవలను వివరించారు. గాయనీ గాయకులు పలు చిత్ర గీతాలను ఆలపించారు. నిర్వాహకులు వెంకట్రామ శర్మను కౌతా పూర్ణానందం పురస్కారంతో సత్కరించారు.

దక్షిణోత్తరం నృత్య ప్రదర్శన



నృత్యప్రదర్శన చేస్తున్న నిరుపమ, రాజేంద్ర బృందం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఉగాదిని శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి వార్ల సన్నిధిలో ఆదివారం దక్షిణోత్తరం ప్రత్యేక నృత్య ప్రదర్శన జరగనుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై సాయంత్రం ఆరుగంటలకు ఈ ప్రత్యేక నృత్య ప్రదర్శన నిర్వహించారు. గుడి సంబరాల పేరిట పరంపర ఫౌండేషన్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ఈ నృత్య ప్రదర్శనను ఏర్పాటు చేశారు. తొలుత కళావేదికపై ఆలయ ఈవో కె.రామచంద్రమోహన్ దంపతులు, ఫౌండేషన్ బాధ్యులు శ్రీనగి, శశిరెడ్డి, ప్రమోద్ అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీతలైన నిరుపమ, రాజేంద్ర భరతనాట్యం, కథక్ రెండు శాస్త్రీయ నృత్య ప్రక్రియల అద్భుతమైన సంగమాన్ని దక్షిణోత్తరంలో ప్రదర్శించారు. నృత్య ప్రదర్శనను వీక్షించేందుకు పెద్ద ఎత్తున సంగీతాభిమానులు, అమ్మవారి భక్తులు తరలివచ్చారు.

భర్త వేధింపులపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భార్యను వేధింపులకు గురి చేస్తున్న భర్తపై కొత్తపేట పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు కథనం మేరకు.. గొల్లపాలెంగట్టు కస్తూరిబా ఆశ్రమం వద్ద పల్లెకిల ఉషారాణి, కాశిరెడ్డి దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి 15ఏళ్ల కిందట వివాహం కాగా ఒక బాబు ఉన్నారు. కొంత కాలంగా కాశిరెడ్డి పనికి వెళ్లకుండా ఇబ్బందులకు గురిచేయడంతో భార్య పనికి వెళ్తోంది. ఈ క్రమంలో కాశిరెడ్డి భార్యను వేధింపులకు గురిచేస్తుండటంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ





ఉగాది పండుగ సందర్భంగా ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గామల్లేశ్వరస్వామి వార్లను ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు. క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయ అధికారులు క్యూలైన్‌లో మంచినీటిని అందించడంతో పాటు భక్తులు వేచి ఉండే ప్రాంతాల్లో కూలర్లు ఏర్పాటు చేశారు. వేసవి నేపథ్యంలో ఆలయ ప్రాంగణంలో రెండు చోట్ల భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు.

సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ